# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

గురువారం
12 మే, 2022

సంపుటి : 10

సంచిక :10

రంగారెడ్డి

పేజీలు 4

వెల 4/-


## మే 23 నుంచి పదో తరగతి పరీక్షలు



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ పదో తరగతి పరీక్షల తేదీలను ప్రకటించింది. మే 23 నుంచి జూన్ 1 వరకు టెన్త్ క్లాస్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొంది.. ఈ ఏడాది మొత్తం 5 లక్షల 8వేల 275 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా.. విద్యార్థుల హాల్ టిక్కెట్లు గురువారం వెబ్ సైట్‌లో అందుబాటులో ఉండనున్నట్లు పేర్కొంది.



## దళితబంధు కాదు.. దగా బంధు: ఆర్ఎస్పీ




# అనుమతులా ?

**తెలంగాణను సంప్రదించకుండానే తుంగభద్రపై ప్రాజెక్టులకు అనుమతి**

**సీడబ్ల్యూసీ తీరుపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం**

**సీడబ్ల్యూసీకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ**

హైదరాబాద్, మే11 : నదీ పరీవాహక రాష్ట్రాల అభ్యంతరాలు, ట్రిబ్యునల్ అవార్డులను పరిశీలించకుండా కేవలం కర్ణాటక ప్రభుత్వమే సొంతంగా చేసుకొన్న నీటి కేటాయింపుల ఆధారంగా అప్పర్ భద్ర, అప్పర్ తుంగ ప్రాజెక్టులకు ఏవిధంగా అనుమతులిస్తారని సెంట్రల్ వాటర్ కమిషన్‌ను తెలంగాణ సర్కారు నిలదీసింది. ఆ ప్రాజెక్టులకు మంజూరుచేసిన అనుమతులను నిలిపేయాలని డిమాండ్‌చేసింది. సెంట్రల్ వాటర్ కమిషన్ ప్రాజెక్టు అప్రైజల్ (సౌత్) డైరెక్టరేట్‌కు తెలంగాణ రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్ బుధవారం లేఖ రాశారు. కర్ణాటక చేపట్టిన అప్పర్‌భద్ర, అప్పర్‌తుంగ ప్రాజెక్టులపై అభ్యంతరాలను వ్యక్తంచేశారు. ప్రాజెక్టులకు జాతీయహోదా ఇవ్వడంపై తెలంగాణకు ఎలాంటి అభ్యంతరాలు లేవని, అంతర్రాష్ట్ర అంశాలను, ట్రిబ్యునల్ 1 అవార్డును పరిగణనలోకి తీసుకోకుండా అనుమతిలివ్వడం సరికాదని సీడబ్ల్యూసీకి సూచించారు. కృష్ణా బేసిన్‌లో ఇప్పటికే తీవ్ర నీటిలోటుందని ఉన్నదని, తుంగభద్ర బేసిన్ నుంచే నిరంతరాయంగా నీరు రావాల్సి ఉన్నదని తెలిపారు. ప్రస్తుతం తుంగభద్రపై ప్రాజెక్టులను నిర్మిస్తే ఆ బేసిన్ నుంచి కృష్ణాకు నీటిరాక తగ్గిపోయి, దిగువనున్న తెలంగాణ ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కే-8లోని తుంగభద్ర సబ్ బేసిన్, ఇతర బేసిన్లకు ట్రిబ్యునల్‌చేసిన నీటి కేటాయింపుల్లో వ్యత్యాసాలు ఉన్నప్పటికీ, పరిమితులను విధించిందన్నారు. తుంగభద్ర సబ్‌బేసిన్‌లో ఎక్కడెక్కడ.. ఎంత మొత్తంలో నీటిని వినియోగించుకోవాలో నిర్దేశించిందని వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే అప్పర్‌భద్ర, అప్పర్‌తుంగకు ట్రిబ్యునల్1 నీటిని కేటాయించలేదని స్పష్టంచేశారు.

తుంగభద్ర సబ్ బేసిన్‌లో మొత్తం నీటి లభ్యతపై అధ్యయనం చేసి అంచనావేసిన


(మిగతా 2వ పేజీలో)


## లంకలో షూట్ ఎట్ సైట్ ఆదేశాలు



శ్రీలంకలోని తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఘోరమైన హింసాకాండకు దారితీసింది. నెలలు తరబడి సాగుతున్న అల్లర్లు కాస్తా హింసాత్మకంగా మారిపోతున్నాయి. తొలుత శాంతియుతంగా నిరసనలు చేస్తున్నవారిపై రాజపక్స కుటుంబ సభ్యులు దాడి చేయడంతోనే పరిస్థితి మరింత తీవ్రతరంగా మారింది. దీంతో శ్రీలంక అధికారులు మంగళవారం పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు షూట్‌ఎట్‌సైట్ ఆర్డర్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు శ్రీలంక రక్షణ మంత్రిత్వశాఖ సెక్రటరీ జనరల్ జీడీహెచ్ కమల్ గుణరత్నే అసలు ఎందుకు ఇలాంటి నిర్ణయం తీసుకోవల్సి వచ్చిందో వివరించారు. ఆయన మాట్లాడుతూ..."తొలుత పరిస్థితిని అదుపులో ఉంచేందుకు కట్టుది?ట్టమైన కర్ఫ్యూను విధించినప్పటికీ వాటన్నింటిని ఉల్లంఘించి మరీ హింసకు పాల్పడటంతో ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదు. ఘోరమైన హింసకు పాల్పడినవారం దరూ లంకేయులే. మా సొంత వ్యక్తుల పై కాల్పులు జరపడం ఇష్టం లేదు. అయితే తాము మొదటగా నిరసనకారులను చెదరగొట్టేందుకు గాలిలో కాల్పులు జరుపుతాం. అయినప్పటికీ వినకపోతే పోలీసులు వారి మోకాళ్ల పై కాల్పులు జరుపుతారు. ఇక అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోతే సైన్యం రంగంలోకి దిగుతుంది. అయినా శ్రీలంక అధ్యక్షుడు మహిందా రాజపక్స మంచి నాయకుడు. ఇప్పుడు ఆయనపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయని రక్షణ కల్పించకూడదని అర్థం కాదు. శ్రీలంక రాజ్యాంగం ప్రకారం ఏ మాజీ ప్రెసిడెంట్‌కైనా అతని మరణం వరకు భద్రతా బలగాలు రక్షణ కల్పిస్తాయి. మా రక్షణ బృందం అమాయకులపై ఎప్పటికీ కాల్పులు జరపదు. అని అన్నారు.



# కేసీఆర్ మాపై కక్షగట్టారు

**బీజేపీ సర్పంచ్‌ను ఎన్నుకున్నామని పెన్షన్లు, ఇళ్లు ఇవ్వట్లేదు**

**బండి సంజయ్ ఎదుట సంతాపూర్ గ్రామస్తుల ఆవేదన**

**రంగారెడ్డి జిల్లాలో రెండోరోజు సాగిన 'ప్రజా సంగ్రామ యాత్ర'**

రంగారెడ్డి జిల్లా: 'మేము బీజేపీ సర్పంచ్‌ను ఎన్నుకున్నామని స్థానిక ఎమ్మెల్యే సహా సీఎం కేసీఆర్ మాపై కక్షగట్టారు. పెన్షన్లు, డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు ఇవ్వట్లేదు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయట్లేదు'అని రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం సంతాపూర్ గ్రామస్తులు బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. సంజయ్ ప్రజా సంగ్రామ యాత్ర బుధవారం షాద్‌నగర్ నియోజకవర్గం కేశంపేట, కొత్తపేట, సంతాపూర్, కోనాయపల్లి గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా సంతాపూర్‌లో ఏర్పాటు చేసిన రచ్చబండలో ఆయన పాల్గొన్నారు. సర్పంచ్ అంజయ్య సహా గ్రామస్తులు తమ సమస్యలను సంజయ్‌కు విన్నవించారు. తమ ఊరికి రోడ్లు, డ్రైనేజీ పనులకు నిధులివ్వట్లేదని.. అర్హులకు పెన్షన్లు, రేషన్ కార్డులు ఇవ్వట్లేదని, ఊర్లో సీసీ రోడ్లు వేయనీయట్లేదని, అభివృద్ధిని అడ్డుకుంటున్నారని చెప్పారు. స్పందించిన సంజయ్.. అంగన్‌వాడీ కేంద్రం కోసం తన ఎంపీ లాండ్స్ నుంచి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. 'సార్.. మా ఊర్లో నెల రోజుల నుంచి తాగేందుకు మంచినీరు రావట్లేదు'అని కొత్తపేటకు చెందిన పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేయగా.. ఇంటింటికీ మంచినీళ్ల


(మిగతా 2వ పేజీలో)




# దేశద్రోహ చట్టంపై స్టే


**సుప్రీంకోర్టు నిర్ణయం.. కేసులపై విచారణ ఆపాలి**

**కొత్తగా కేసులు పెట్టొద్దు.. కేంద్ర, రాష్ట్రాలకు ఆదేశం**

**పునఃసమీక్షకు అనుమతి**

బ్రిటిష్ జమానా నాటి దేశద్రోహం చట్టం విషయంలో సుప్రీంకోర్టు బుధవారం కీలక నిర్ణయం వెలువరించింది. చట్టం అమలుపై స్టే విధించింది. కేంద్రం పునఃసమీక్ష పూర్తయ్యేదాకా ఈ చట్టం కింద కొత్తగా కేసులు నమోదు చేయొద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఇప్పటికే నమోదైన కేసుల విచారణ కూడా నిలిపేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు తమ తదుపరి ఉత్తర్వుల దాకా కొనసాగుతాయని పేర్కొంది. దీనిపై జూలై మూడో వారంలో తదుపరి విచారణ చేపడతామని వెల్లడించింది. "ఆలోపు దేశద్రోహ చట్టం కింద కొత్త కేసులు పెట్టడం వంటివి జరిగితే బాధితులు సంబంధిత కోర్టులను ఆశ్రయించవచ్చు. మా ప్రస్తుత ఆదేశాలకు అనుగుణంగా ఆయా కోర్టులకు వారికి తగిన ఊరట కల్పించాలి" అని సూచించింది. ధర్మాసనంలో న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ హిమా కోహ్లీ కూడా ఉన్నారు.

న్యూఢిల్లీ: "దేశద్రోహ చట్టం (124ఏ) ప్రస్తుత సామాజిక పరిస్థితులకు అనుగుణంగా లేదు. దేశ భద్రతకు, సమగ్రతకు సంబంధించిన అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆందోళన కూడా అర్థం చేసుకోదగినదే. కానీ ప్రభుత్వ ప్రయోజనాలు, పౌరుల ప్రయోజనాల మధ్య సమతుల్యత అవసరం. కష్టమే అయినా దాన్ని సాధించడం తప్పనిసరి" అంటూ విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టం పునఃసమీక్షకు కేంద్రానికి అనుమతిస్తున్నట్టు పేర్కొంది. "ఆలోపు కేంద్రం గానీ, రాష్ట్ర ప్రభుత్వాలు గానీ దేశద్రోహ చట్టం కింద ఎలాంటి ఎఫ్ఐఆర్‌లూ నమోదు చేయవని, ఇప్పటికే నమోదైన కేసుల్లో విచారణ కొనసాగించబోవని ఆశిస్తున్నాం. ఈ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్న తీరును గత విచారణ సందర్భంగా అటార్నీ జనరల్ మా ముందుంచారు. హనుమాన్ చాలీసా కేసు వంటి పలు ఉదాహరణలను మా దృష్టికి తెచ్చారు. అందుకే పునఃసమీక్ష ముగిసేదాకా ఈ చట్టాన్ని ప్రయోగించకుండా ఉండటమే సరైందని భావిస్తున్నాం" అని జస్టిస్ రమణ తన తీర్పులో



పేర్కొన్నారు.

చట్టంపై స్టే విధించే బదులు దేశద్రోహ చట్టం కింద నమోదైన కేసుల విచారణ తీరుతెన్నులను పర్యవేక్షించేందుకు ఎస్పీ ర్యాంకు పోలీసు అధికారిని నియమించాలని కేంద్రం సూచించగా ధర్మాసనం అంగీకరించలేదు. ఇది కేసు పెట్టదగిన నేరాలకు సంబంధించిన చట్టం గనుక దాని కింద ఎఫ్ఐఆర్‌ల నమోదును నిరోధించలేమని కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభిప్రాయపడ్డారు. 1962లో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కూడా దేశద్రోహ చట్టాన్ని సమర్థించిందని గుర్తు చేశారు. కేంద్రం లేవనెత్తిన ఈ అంశంపై సంప్రదింపుల నిమిత్తం విచారణను ధర్మాసనం కాసేపు



(మిగతా 2వ పేజీలో)

సంపాదకీయం



# ఇది రావణ కాష్ఠం

లంక తగలబడుతోంది. ఆంజనేయుడి తోకకు అంటించిన నిప్పు ఆనాటి లంకాదహనానికి దారి తీస్తే, ఇప్పుడు కట్టలు తెగిన ప్రజాగ్రహం ఆ పని చేస్తోంది. అప్పుడైనా, ఇప్పుడైనా పాలకుల పాపమే శాపమై ఆ దేశాన్ని దహిస్తోంది. అనేక వారాల ఆందోళనలు హింసారూపం దాల్చడంతో ప్రధానమంత్రి పదవి నుంచి అన్నయ్య మహింద సోమవారం పక్కకు తప్పుకున్నారు. తమ్ముడు గొటబయ రాజపక్స దేశాధ్యక్ష పీఠాన్ని పట్టుకొని వేలాడుతున్నారు. నెలరోజుల్లో రెండోసారి దేశంలో ఎమర్జెన్సీ. అన్నిటికీ కొరత. కర్ఫ్యూ ఉన్నా వీధుల్లో నిరసనకారులు. సోమవారం నాటి ఘర్షణల్లో ఒక పార్లమెంట్ సభ్యుడితో సహా కనీసం ఎనిమిది మంది మరణం. 225 మందికి పైగా గాయాలు. మంగళవారం రాజపక్సీయులు హెలికాప్టర్‌లో పారిపోవడం. ఇవన్నీ చూస్తుంటే -శ్రీలంక ఆర్థిక సంక్షోభం నుంచి పూర్తిగా రాజకీయ సంక్షోభంలోకి జారిపోయిందని అర్థమవుతోంది. హింసాకాండ, రక్తపాతం శ్రీలంకకు కొత్త కావు. కానీ, పౌర సమాజంలో ఇప్పుడు చూస్తున్నంత ఆగ్రహం, హింస మునుపెన్నడూ చూడనివి. గత నెలన్నర పరిణామాలు, సమాజంలోని అనిశ్చితి, ప్రస్తుతం పాలనే లేని పరిస్థితులు చూస్తుంటే-హిందూ మహాసముద్రంలోని ఈ బుద్ధభూమి అంత ర్యుద్ధం దిశగా సాగుతోందా అని ఆందోళన కలుగుతుంది. మహిందా ఇల్లు, వారి పూర్వీకుల గృహం సహా మాజీ మంత్రుల నివాసాలు జనాగ్రహంలో దగ్ధమైన తీరు చూస్తే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. దేశవ్యాప్త కర్ఫ్యూను ఉల్లంఘించి మరీ, లగ్జరీ, స్పోర్ట్స్ కార్లతో సహా వాహనాలను నిరసనకారులు ధ్వంసం చేశారు. ప్రతిపక్ష నేతలు సైతం వారి ఆగ్రహం నుంచి తప్పించుకోలేకపోయారు. విధ్వంసానికి పాల్పడుతున్న ప్రదర్శనకారుల్ని కట్టడి చేయలేక చివరకు మంగళవారం నాడు రక్షణ శాఖ కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు జారీ చేసిందంటే ద్వీపదేశంలోని పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇటు శాంతిభద్రతల సమస్య, అటు ప్రభుత్వమే లేని పాలనతో రాజకీయ సంక్షోభం -వెరసి శ్రీలంకది చిత్రమైన పరిస్థితి. కనీసం మధ్యంతర ప్రభుత్వం ఏర్పాటుతో తాత్కాలికంగా పరిస్థితుల్ని చక్కదిద్దే ప్రయత్నమొక్కటే ఇప్పటికిప్పుడు కనిపిస్తున్న దారి. ఇప్పటికే అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)తో దీర్ఘకాలిక ఆర్థిక వెసులుబాటు కోసం ఈ ద్వీపదేశం ప్రయత్నిస్తున్న వేళ అది మరీ ముఖ్యం. రాబోయే కొద్ది రోజుల్లో శ్రీలంక పార్లమెంట్ సభ్యులు సమావేశ మవుతారా, దేశానికి గండం గట్టెక్కడానికి అఖిలపక్ష ప్రభుత్వం ఏర్పాటు చేస్తారా, సైన్యాన్నీ -పోలీసులనూ నమ్ముకున్న అధ్యక్షుడు గొటబయ రాజపక్స ఆ ప్రక్రియకు సహకరిస్తారా అన్నది వేచిచూడాలి. దేశ ప్రధాని నివాసం దగ్గరలఈ అత్యున్నత స్థాయికి చెందిన సీనియర్ మోస్ట్ పోలీసు అధికారిపై ఆగ్రహోదగ్ర జనం భౌతిక దాడికి దిగిన తీరు చూస్తే -వెంటనే ఆపద్ధర్మ ప్రభుత్వం పగ్గాలు చేతబట్టి, పరిస్థితులను చక్కదిద్దకపోతే ఈ పౌర సంక్షోభం పూర్తిగా చేయి దాటిపోయే ప్రమాదమైతే ఉంది. వీటన్నిటికీ మూలమైన ఆర్థిక సంక్షోభం అతి పెద్ద సమస్య. పెరుగుతున్న ధరలు, పడిపోతున్న వ్యవసాయ ఉత్పత్తులు, శూన్యమైన పర్యాటక ఆదాయంతో శ్రీలంక పీకలలోతు కష్టాల్లో ఉంది. రాజకీయ సంక్షోభం మాటెలా ఉన్నా, ఈ ఆర్థిక సంక్షోభం ఇప్పుడప్పుడే పరిష్కార మయ్యేది కాదు. పేరుకుపోయిన వందల కోట్ల డాలర్ల అప్పు తీరేదీ కాదు. ఈ చిన్ని ద్వీపదేశం రాగల కొన్నేళ్ళలో ఏకంగా 5 వేల కోట్ల డాలర్లకు పైగా అప్పులు తీర్చాల్సిన తరుణంలో ఇప్పుడు కావాల్సింది దూరదృష్టి, దీర్ఘకాలిక పరిష్కారం. దేశంలో కరవు, ఆహార కొరత రాకుండా అడ్డుకట్ట వేయాలంటే ఆర్థిక విధానాలను సమూలంగా ప్రక్షాళన చేయడమే మార్గమంటున్నారు ఆర్థికవేత్తలు. ఉప్పూ నిప్పూగా ఉండే సింహళీయులు, తమిళులు ఇప్పుడు రాజపక్సీయుల పాలనను వ్యతిరేకించడంలో అనూహ్యంగా ఒక్కటైనట్టే, చట్టసభలోనూ కలసి ముందుకు సాగడం ఈ గడ్డుకాలంలో ముఖ్యం. చిత్రమేమిటంటే-చాలాకాలంగా శ్రీలంక, దాని పాలకులు చైనాతో చేతులు కలుపుకొని తిరిగినా, కరెన్సీ కష్టాల వేళ ఆ దేశం లంకేయుల వైపు కన్నెత్తి చూడకపోవడం! భారతదేశమే ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో అంతా కలిపి 300 కోట్ల డాలర్ల మేర సింహళీయులకు సాయం చేసింది. మన ఆర్థిక మంత్రి అమెరికాలో సైతం శ్రీలంకకు నిధులు అందించాలంటూ ఐఎంఎఫ్ లాంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలను అభ్యర్థించారు. సిలోన్‌ను కేవలం పొరుగుదేశంగానే కాక హిందూ మహాసముద్రంలో శాంతి, సుస్థిరతలకు కీలక భాగస్వామిగా భారత్ చూస్తోంది. గతంలో శ్రీలంక త్రాసు చైనా వైపు మొగ్గడంతో నష్టపడ్డ భారత్ పోయిన పట్టు మళ్ళీ సాధించుకుంటోంది. రాజపక్సీయుల సంగతికొస్తే, గతంలో ఒకటికి రెండుసార్లు ఎన్నికల్లో మట్టికరిచినా, మళ్ళీ పైకి లేచిన సత్తా ఆ కుటుంబానిది. కానీ ఈసారి కుటుంబ పాలనతో కూడబెట్టిన అవినీతి, సంపాదించిన అపకీర్తి చూస్తే వారు ఇక అధికారాన్ని మర్చిపోవాల్సిందే. దేశాధ్యక్షుడు గొటబయ మాత్రం పెల్లుబి కుతున్న ప్రజాగ్రహాన్ని సైనికబలంతో అణిచివేయాలని దింపుడుకళ్ళెం ఆశతో ఉన్నారు. ఎల్టీటీఈ అణచివేతలో పాత్రధారిగా, నిరంకుశ 'టెర్మినేటర్' పేరుపడ్డ ఆయన ఆ పట్టుతో కిరీటం కాపాడు కోవాలని శతవిధాల యత్నిస్తున్నారు. అయితే, సంక్షుభిత సింహళాన్ని సొంతకాళ్ళపై నిలబెట్టడం, ఆయన తన పీఠాన్ని నిలబెట్టుకోవడం -రెండూ ఇప్పుడు కష్టమే! 1930ల తర్వాత ఎన్నడూ లేని ఆర్థిక సంక్షోభం, 1953 నాటి మహా హర్తాళ్ తర్వాత మళ్ళీ అంతటి నిరసనల్లో చిక్కుబడ్డ శ్రీలంకలో కొన్నేళ్ళపాటు ఈ రావణకాష్ఠం కాలుతూనే ఉంటుందనేది నిపుణులు చెబుతున్న నిష్ఠురసత్యం.



# అడుగకుండా.. అనుమతులా

(మొదటిపేజీ తరువాయి)

తరువాతే నీటిని కేటాయించాలని పేర్కొన్నదని తెలిపారు. ట్రిబ్యునల్ 2 ఈ మేరకు కే 9 సబ్ బేసిన్‌లోని నీటి లభ్యతను అంచనా వేసిందని చెప్పారు. అనంతరం 65 శాతం డిపెండబులిటీ కింద అప్పర్‌భద్రకు 9, అప్పర్ తుంగా 11 టీఎంసీలను కేటాయించిందని గుర్తుచేశారు. ఆ ప్రాజెక్టులకు నీటిని కేటాయించడంపై సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలైందని, విచారణ కొనసాగుతున్నదని తెలంగాణ ఈఎన్సీ గుర్తుచేశారు. నదీ పరీవాహక రాష్ట్రాల అవసరాలను, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టంచేశారు. లేఖతోపాటు ట్రిబ్యునల్ 1 అవార్డు కాపీలతోపాటు పలు పత్రాలను జతచేసింది.

# దేశద్రోహ చట్టంపై స్టే

(మొదటిపేజీ తరువాయి)

నిలిపేసింది. అనంతరం తిరిగి విచారణ చేపట్టింది. "కేంద్రం లేవనెత్తిన అంశాన్ని కూలంకషంగా పరిశీలించాం. సదరు చట్టాన్ని (సుప్రీంకోర్టు వంటి) సాధికార ఫోరం సమీక్షించవచ్చని కేంద్రం కూడా నాటి విచారణ సందర్భంగా అంగీకరించింది" అని వ్యాఖ్యానించింది. అన్ని అంశాలనూ లోతుగా పరిశీలించిన తర్వాతే దేశద్రోహ చట్టం అమలుపై స్టే విధించాలని నిర్ణయానికి వచ్చినట్టు వివరించింది. ఇతరత్రా కూడా ఈ చట్టం దుర్వినియోగం కాకుండా చూడాల్సిందిగా రాష్ట్రాలకు సూచనలిచ్చేందుకు కేంద్రానికి అనుమతిచ్చింది. 10 పేజీల తీర్పును జస్టిస్ రమణ రాశారు. ప్రధాని మోదీ కూడా ఇటీవల దేశద్రోహ చట్టాన్ని ప్రస్తావిస్తూ, 'పౌర స్వేచ్ఛను, మానవ హక్కులను పరిరక్షించాల్సిన అవసరముంది' అని వ్యాఖ్యానించారని తీర్పులో ఆయన ప్రస్తావించారు.

## స్టే సరికాదు: కేంద్రం

దేశద్రోహ చట్టంపై పునఃసమీక్ష జరిగేదాకా కేసుల విచారణను, దానికింద కొత్త కేసుల నమోదును నిలిపేస్తారా అని మంగళవారం విచారణ సందర్భంగా కేంద్రాన్ని ధర్మాసనం ప్రశ్నించడం, 24 గంటల్లోగా వైఖరి తెలిపాలని పేర్కొనడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్రం



అభిప్రాయాలతో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి అఫిడవిట్ సమర్పించారు. స్టే విధింపుకు కేంద్రం వ్యతిరేకమని తెలిపారు. ఈ చట్టం కింద పెండింగులో ఉన్న కేసుల్లో బెయిల్ అభ్యర్థనలను ఆరోపణల తీవ్రతకు అనుగుణంగా వీలైనంత త్వరగా పరిష్కరించవచ్చన్నది కేంద్రం ఉద్దేశమన్నారు. "ఎందుకంటే ఆ కేసుల్లో ఉగ్రవాద, మనీ లాండరింగ్ వంటి కోణాలు కూడా ఇమిడి ఉండొచ్చు. ఏమైనా దేశద్రోహ చట్టం కింద పెండింగ్ కేసులన్నీ కోర్టుల ముందే ఉన్నాయి. కాబట్టి న్యాయస్థానాలపై నమ్మకముంచాలి" అని మెహతా వ్యాఖ్యానించారు.

## లక్ష్మణరేఖ దాటొద్దు: కేంద్ర న్యాయ మంత్రి కిరణ్ రిజిజు

న్యూఢిల్లీ: రాజ్యాంగ వ్యవస్థలు లక్ష్మణరేఖ దాటకూడదని కేంద్ర న్యాయ మంత్రి కిరణ్ రిజిజు అభిప్రాయపడ్డారు. దేశద్రోహ చట్టంపై సుప్రీంకోర్టు స్టే విధించడంపై బుధవారం మీడియా ప్రశ్నలకు బదులిస్తూ ఆయన ఈ మేరకు నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. "కోర్టులు ప్రభుత్వాన్ని, శాసన వ్యవస్థను గౌరవించాలి. ప్రభుత్వం కూడా కోర్టులను గౌరవించాలి. ఈ మేరకు స్పష్టమైన లక్ష్మణరేఖను రాజ్యాంగం ఎప్పుడో నిర్దేశించి ఉంచింది. దాన్ని ఎవరూ మీరకూడదు" అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సూచన మేరకు దేశ సార్వభౌమత్వం, సమగ్రతలకు భంగం కలగని రీతిలో దేశద్రోహ చట్టాన్ని పునఃసమీక్షిస్తామని చెప్పారు. దీన్ని సాహసోపేతమైన చర్యగా అభివర్ణించారు. చట్టాలు చేయడం ప్రభుత్వ బాధ్యతన్నారు.

# రష్యా సైన్యాన్ని తరిమికొడుతున్నాం

**ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ**

## ఖర్కీవ్‌లోని నాలుగు గ్రామాల నుంచి రష్యా సేనలు వెనక్కి

కీవ్: రష్యా దళాలపై తమ సేనలు క్రమంగా పైచేయి సాధిస్తున్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. ఖర్కీవ్ నుంచి రష్యా సైనికులను వెనక్కి తరిమేస్తున్నట్లు తెలిపారు. ఈశాన్య ఖర్కీవ్ ప్రాంతంలోని నాలుగు గ్రామాల నుంచి రష్యా జవాన్లను తరిమికొట్టినట్లు ఉక్రెయిన్ సైన్యం సైతం ప్రకటించింది. తమ ధాటికి తట్టుకోలేక వారు రష్యా సరిహద్దు దిశగా తరలిపోతున్నారని పేర్కొంది. ఉక్రెయిన్ సైన్యంతో పోలిస్తే రష్యా సైన్యం ఎన్నో రెట్లు బలమైనది. అయినప్పటికీ రష్యా ఇప్పటికీ ఉక్రెయిన్‌పై పట్టు సాధించలేకపోవడం గమనార్హం. ఉక్రెయిన్‌లో చాలాచోట్ల రష్యాకు గట్టి ప్రతిఘటన ఎదురవుతోంది.

### రష్యా టి--90 యుద్ధ ట్యాంకు ధ్వంసం

రూ.28 కోట్ల (3 మిలియన్ పౌండ్ల) ఖరీదైన రష్యా టి-90 వ్లాదిమిర్ యుద్ధ ట్యాంకును ఉక్రెయిన్ సైన్యం ధ్వంసం చేసింది. ఇందుకోసం ఉక్రెయిన్ ఆర్18 అనే సొంత డ్రోన్‌ను ఉపయోగించడం విశేషం. ఈ డ్రోన్ ద్వారా కేవలం రూ.38 వేల విలువైన (400 పౌండ్లు) రాకెట్లను జారవిడిచి టి-90 ట్యాంకును ఉక్రెయిన్ ధ్వంసం చేసింది. ఈ దృశ్యాలను ఉక్రెయిన్ డ్రోన్ వార్‌ఫేర్ యూనిట్ విడుదల చేసింది. ఆర్18 డ్రోన్ 5 కిలోల పేలోడ్లను మోసుకెళ్లగలదు.

### రష్యా గ్యాస్ సరఫరా నిలిపివేత

ఉక్రెయిన్%--%రష్యా యుద్ధం మొదలయ్యాక తొలిసారిగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉక్రెయిన్ నుంచి యూరప్ దేశాలకు సరఫరా అవుతున్న సహజ వాయువును ఓ ఉక్రెయిన్ ఆపరేటర్ నిలిపివేశాడు. యూరప్‌కు గ్యాస్ రవాణాకు రష్యా ఇక ఇతర మార్గాలు చూసుకోవాల్సిందేనంటున్నారు. రష్యా గ్యాస్‌లో నాలుగింట మూడొంతులు ఉక్రెయిన్ గుండానే సరఫరా అవుతోంది.

### రష్యా విస్తరణ యత్నాలకు ఎదురు దెబ్బ

నల్ల సముద్రంలోని స్నేక్ ఐలాండ్‌లో రష్యా దళాలపై ఉక్రెయిన్ సైన్యం ఎదురు దాడికి దిగుతోందని బ్రిటిష్ మిలటరీ తెలిపింది. నల్లసముద్రంలో పెత్తనాన్ని విస్తరించేందుకు రష్యా



ప్రయత్నాలకు ఇది విఘాతమని ట్వీట్ చేసింది.

### హిట్లర్/స్టాలిన్ కంటే పుతిన్ డేంజర్

హిట్లర్/స్టాలిన్ వంటి నియంతల కంటే పుతిన్ ప్రమాదకారి అని పోలండ్ ప్రధాని మాటిసుజ్ మోరావీకి అన్నారు. పుతిన్‌ది రాక్షస భావజాలమని, దాన్ని అంతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. 20వ శతాబ్దపు నియంతల వద్ద ఉన్నవాటికంటే ఎక్కువ అపాయకరమైన మారణాయుధాలు పుతిన్ వద్ద ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పుతిన్ లేని ప్రపంచం(డిపుతినైజేషన్) సాకారం కావాలని మోరావికీ ఆకాంక్షించారు. రష్యా అధ్యక్షుడి సిద్ధాంతం కేవలం ఉక్రెయిన్‌కే కాదు, మొత్తం యూరప్‌కు ముప్పేనని ఉద్ఘాటించారు.

### నలుగురు రష్యా రీజినల్ గవర్నర్ల రాజీనామా

పశ్చిమ దేశాల ఆంక్షలతో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక నలుగురు రష్యన్ రీజినల్ గవర్నర్లు పదవులకు రాజీనామా చేశారు. టామ్‌స్క్, సరాటోవ్, కిరోవ్, మారీ ఎల్ గవర్నర్లు పదవుల నుంచి తప్పుకున్నారు. మరోసారి ఎన్నికల్లో పోటీ చేసే ఉద్దేశం లేదని రైజాన్ రీజినల్ గవర్నర్ చెప్పారు. ఈ ఐదు రీజియన్లకు వచ్చే సెప్టెంబర్‌లో ఎన్నికలు జరుగనున్నాయి.

# పోలవరాన్ని పరిశీలించిన సీడబ్ల్యూసీ బృందం

## వరద ఉధృతికి కోతకు గురైన ప్రాంతాలు పరిశీలన

## పూడ్చివేత విధానంపై సీడబ్ల్యూసీకి నివేదిక

## 17న కేంద్ర జల్ శక్తి శాఖ సలహాదారు నేతృత్వంలో సమీక్ష

## 18న డీడీఆర్పీ సమావేశం



అమరావతి/పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు పనులను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) డిజైన్స్ విభాగం డైరెక్టర్ ఖయ్యూం అహ్మద్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల బృందం బుధవారం పరిశీలించింది. దిగువ కాఫర్ డ్యామ్‌లో కోతకు గురైన ప్రాంతాన్ని జియో మెంబ్రేన్ బ్యాగ్‌లలో ఇసుకను నింపి పూడ్చుతున్న విధానాన్ని పరిశీలించింది. ప్రధాన డ్యామ్ (ఈసీఆర్ఎఫ్) ప్రాంతంలో గోదావరి వరద ఉధృతికి కోతకు గురైన ప్రాంతాలను, డయాఫ్రమ్ వాల్‌లో దెబ్బతిన్న భాగాలను తనిఖీ చేసింది. క్షేత్రస్థాయి అధ్యయనంలో వెల్లడైన అంశాలు, రాష్ట్ర జల వనరుల శాఖ అధికారులు సమర్పించిన నివేదిక ఆధారంగా ఇక్కడ చేపట్టాల్సిన పనులపై సీడబ్ల్యూసీ బృందం నివేదికను రూపొందించింది. దీనిపై ఈనెల 17న కేంద్ర జల్ శక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరాం నేతృత్వంలో ఢిల్లీలో జరిగే సమావేశంలో చర్చిస్తారు. అనంతరం కోతకు గురైన ప్రాంతాలను పూడ్చివేసే విధానానికి మెరుగులు దిద్దుతారు. ఈనెల 18న జరిగే డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానల్ (డీడీఆర్పీ) సమావేశంలో ఈ విధానంపై చర్చించి, ఆమోదించే అవకాశం ఉందని అధికారవర్గాలు తెలిపాయి. పురుషోత్తపట్నం వద్ద డ్రెడ్జింగ్ చేస్తూ ఇసుకను ప్రధాన డ్యామ్ వద్ద కోతకు గురైన ప్రాంతాల్లోకి పొరలు పొరలుగా పంపింగ్ చేస్తూ వైబ్రో కాంపాక్షన్ ద్వారా పటిష్టపరచాలని రాష్ట్ర జలవనరుల అధికారులు ప్రతిపాదించారు. డయా ఫ్రమ్ వాల్ దెబ్బతిన్న ప్రాంతాల్లో సమాంతరంగా కొత్తగా డయాఫ్రమ్ వాల్ వేసి పాత దానికి అనుసంధానం చేసే పద్ధతిని కూడా ప్రతిపాదించారు. కేంద్ర జలసంఘం బృందంలో డైరెక్టర్ రాహుల్ కుమార్‌సింగ్, డిప్యూటీ డైరెక్టర్లు సోమేష్‌కుమార్, అశ్వని కుమార్ వర్మ, అసిస్టెంట్ డైరెక్టర్ గౌరవ్ తివారీ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ డైరెక్టర్ పి.దేవందర్‌రావు ఉన్నారు. ప్రాజెక్టు పనులను సీఈ సుధాకర్‌బాబు వారికి వివరించారు.

# కేసీఆర్ మాపై కక్షగట్టారు

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వడం చేతకాని కేసీఆర్.. ఊరూరా బెల్ట్‌షాపును తెరిచి ప్రతి ఒక్కరితో మందు తాగిస్తున్నారని విమర్శించారు.

### ఎక్కడ చూసినా గుంతల రోడ్లు

దళితులకు మూడెకరాలు ఇస్తామని ఇవ్వకుండా 70 ఏళ్ల క్రితం పేదలకు పంచిన ప్రభుత్వ భూములను కేసీఆర్ గుంజుకుంటున్నారని సంజయ్ మండి పడ్డారు. తాను పాదయాత్ర చేస్తుంటే ఎక్కడ చూసినా గుంతల రోడ్లే దర్శనమిస్తున్నాయని, తలెత్తి ప్రజలకు అభివాదం చేయలేని పరిస్థితి ఉందని, ఏ గుంతలో పడతామో తెలియని దుస్థితి నెలకొందని చెప్పారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌పై కేసీఆర్ కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నారని, ఉద్దేశపూర్వకంగానే ఈ ప్రాంతాన్ని ఎడారిగా మారుస్తున్నారని, నీళ్లిస్తే వాళ్ల రియల్ ఎస్టేట్ దందా నడవదనే ప్రాజెక్టు పనులు ప్రారంభించట్లేదని ఆరోపించారు.

# 4,935 చదరపు గజాలు

## బంజారాహిల్స్‌లో టీఆర్ఎస్‌కు స్థలం

## హైదరాబాద్ జిల్లా కార్యాలయం కోసం కేటాయించిన సర్కార్



హైదరాబాద్: హైదరాబాద్ జిల్లా టీఆర్ఎస్ పార్టీ కార్యాలయం కోసం రాష్ట్ర ప్రభుత్వం బంజారాహిల్స్‌లో 4,935 చదరపు గజాల స్థలాన్ని కేటాయించింది. హైదరాబాద్ జిల్లా షేక్‌పేట మండలం/గ్రామం, ఎన్బీటీ నగర్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నం.12 వద్ద సర్వే నంబర్ 18/పీ, 21/పీలో ఈ స్థలం ఉంది. ఈ మేరకు సీఎస్ సోమేశ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ధరను ఖరారు చేసే ప్రక్రియను పెండింగ్‌లో ఉంచినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీన్ని త్వరగా పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. హైదరాబాద్ జిల్లా పార్టీ కార్యాలయం కోసం సదరు స్థలం కేటాయించాలని జిల్లా కలెక్టర్ ఈ నెల 9న ప్రతిపాదనలు పంపగా 10న సీసీఎల్ఏ ఆమోదముద్ర వేసింది. స్థలం విలువ దాదాపు రూ.70 కోట్లు వరకు ఉంటుందని అంచనా.


# కారు అలా కొనేస్తున్నారట!

న్యూఢిల్లీ: కారు కొనే ముందు షోరూంకి వెళ్లి ప్రత్యక్షంగా చూస్తాం. వీలైతే వాహనాన్ని నడుపుతాం. ఇదంతా పాత పద్ధతి. ఇప్పుడు ట్రెండ్ మారుతోంది. షోరూంకి వెళ్లకుండానే కారు ఎలా ఉందో 3డీలో చూస్తున్నారు. 2020లో ఇలా 3డీని ఆసరాగా చేసుకుని కార్లను 76 లక్షల మంది భారతీయులు వీక్షించారని ఎక్సెంట్రిక్ ఇంజన్ తెలిపింది. 2019తో పోలిస్తే సంఖ్య పరంగా 300 శాతం వృద్ధి నమోదైందని చెబుతోంది. కరోన మూలంగా ఆఫ్‌లైన్ మార్కెటింగ్, షోరూంలలో ప్రమోషన్ కార్యక్రమాలకు అడ్డుకట్ట పడింది. దీంతో కార్ల ఎంపికకై కస్టమర్లు సాంకేతికత, ఆవిష్కరణ దన్నుగా ఉన్న ఆన్‌లైన్‌ను ఆసరాగా చేసుకుంటున్నారు. ఎక్సెంట్రిక్ ఇంజన్ వన్ 3డీ ప్లాట్‌ఫాం ద్వారా కార్లను 3డీ రూపంలో ఆన్‌లైన్‌లో వీక్షించవచ్చు. మారుతి సుజుకి, ఎంజీ, రెనో నిస్సాన్ మిత్సుబిషి తదితర సంస్థలు ఈ కంపెనీకి క్లయింట్లుగా ఉన్నాయి.




**ఆరు నగరాల నుంచే..**

ఆన్‌లైన్‌లో కార్ల ఫీచర్లను వీక్షిస్తున్నవారిలో 51 శాతం మంది ఢిల్లీ, ముంబై, పుణే, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నుంచి ఉంటున్నారని ఎక్సెంట్రిక్ ఇంజన్ వెల్లడించింది. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల నుంచీ ఆన్‌లైన్‌ను ఆసరాగా చేసుకుంటున్నారని వివరించింది. 2018-20 కాలంలో తృతీయ శ్రేణి నగరాల వాటా 9 శాతంగా ఉంది. సికింద్రాబాద్, ఉదయ్‌పూర్, ఇంఫాల్ వీటిలో ముందు వరుసలో ఉన్నాయి. ఆన్‌లైన్ వీడియోలతో పోలిస్తే నాలుగింతలు ఎక్కువగా 3డీ విధానంలో వీక్షిస్తున్నారని ఎక్సెంట్రిక్ ఇంజన్ కో-ఫౌండర్ వరుణ్ షా తెలిపారు. కస్టమర్లను ఆకట్టుకోవాలంటే తయారీ కంపెనీలకు 3డీ విధానం తప్పనిసరి అయిందని అన్నారు. (ఆ ఐటీ నిపుణులకు కాగ్నిజెంట్ తీపి కబురు) చూసిన కారునే కొంటున్నారు.. కొనే ముందు 3డీలో చూస్తున్నారు తాము కొనబోయే కారును 70 శాతం మంది మొబైల్ ద్వారా, 25 శాతం మంది డెస్క్‌టాప్ ద్వారా వీక్షిస్తున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 4 మధ్య ఎక్కువగా




బ్రౌజ్ చేస్తున్నారు. అత్యధికులు బుధవారం నాడు సర్చ్ చేస్తున్నారు. బ్లూ, వైట్ రంగులు ప్రధాన ఆకర్శణగా నిలిచాయి. 40 శాతం మంది ఈ రంగులను ఎంచుకున్నారు. గ్రే, బ్రౌన్, సిల్వర్ కలర్స్‌ను 35 శాతం, రెడ్, బ్లాక్, ఆరేంజ్‌ను 15 శాతం మంది ఇష్టపడ్డారు. ఆన్‌లైన్‌లో చూసిన కారునే కొన్నవారు 91 శాతం మంది ఉండడం గమనార్హం. విదేశాల్లో ఉన్న భారతీయులు తమ వారి కోసం ఆన్‌లైన్‌లో చూసి కొనుగోలు చేస్తున్నారు. 2020లో వీక్షకుల్లో 4.6 శాతం మంది ఎన్నారైలు ఉన్నారు. వీరిలో 31 శాతం ఉత్తర అమెరికా, మధ్యప్రాచ్య 32, యూరప్ 10, యూకే 5, ఆస్ట్రేలియా 4, ఆఫ్రికా నుంచి 2 శాతం ఉన్నారు.

# సూయజ్ బ్లాకేడ్ 54 బిలియన్ల డాలర్ల నష్టం!




న్యూఢిల్లీ: ఎట్టకేలకు వారం రోజుల ప్రతిష్టంభన తర్వాత సూయజ్ కాలువలో చిక్కుకున్న ఎంవీ ఎవర్‌గివెన్ నౌక సోమవారం ముందుకు కదిలింది. మార్చి 23 నుంచి 28 వరకు సూయజ్ కాలువలో ఈ నౌక చిక్కుకోవడంతో ఈజిప్ట్ అధికారులు.. నౌక సిబ్బంది బాధలు ఒకెత్తు. 400 మీటర్ల భారీ నౌక చిక్కుకోవడంతో మరో ఇబ్బంది తలెత్తింది. ఏడు రోజుల పాటు సూయజ్ కాలువలో నౌక నిలిచిపోవడంతో ప్రపంచ వాణిజ్యం 54 బిలియన్ల డాలర్ల మేరకు నష్టపోయిందని అంచనా.. భారతదేశం కూడా వందల కోట్ల మేరకు నష్టపోయిందని తెలుస్తున్నది.పలు దేశాలతో అనుసంధానమైన సూయజ్ కాలువ.. తూర్పు, పశ్చిమ ప్రాంత దేశాలకు వారధి.. అనూహ్యంగా భారీ నౌక చిక్కుకోవడంతో దానికి ఇరువైపులా నౌకలన్నీ నిలిచిపోయాయి. అధికారిక గణాంకాల ప్రకారం నిమిషానికి 6.7 మిలియన్ల డాలర్ల వ్యాపారం సాగుతుంది. అంటే సూయజ్ కాలువ మీదుగా గంటకు 40 కోట్ల డాలర్ల బిజినెస్ జరుగుతుందన్న మాట.ఈస్ట్ నుంచి వెస్ట్‌కు చమురు, రిఫైన్డ్ ఫ్యూయల్, ఆహార, ఇతర వస్తువులు, సరుకులు సరఫరా కావాలంటే సూయజ్ కాలువే దిక్కు.సూయజ్ కాలువలో నౌక నిలిచిపోవడంతో రమారమీ గ్లోబల్ ట్రేడ్.. 12 శాతం మూల్యం చెల్లించుకుందని తెలుస్తున్నది. సూయజ్ కాలువ బ్లాకేజీ మరికొన్ని రోజులు కొనసాగితే యావత్ ప్రపంచం భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చేది.సూయెజ్ కాలువ సంస్థ చైర్మన్ ఒసామా రాబీ మాటల్లో చెప్పాలంటే రోజుకు నౌకల రవాణా నిలిచిపోవడంతో రోజుకు 14-15 మిలియన్ డాలర్ల ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది.ఎంవీ ఎవర్‌గివిన్ నౌక.. సూయజ్ కాలువలో చిక్కుకోవడం వల్ల నిర్దేశిత గడువులోగా సరుకులు రాకపోవడంతో వివిధ దేశాల్లోని ఆఫ్ లైన్, ఆన్‌లైన్ రిటైల్ వ్యాపారులకు మరికొన్ని రోజులు ఇబ్బందులు తప్పకపోవచ్చు.



## ఆటో డెబిట్ చెల్లింపులకు విఘాతం!

న్యూఢిల్లీ: టీవీ, ఓటీటీ, ఇంటర్నెట్ రీచార్జ్‌లు, పోస్ట్‌పెయిడ్ సర్వీసులు, ఇతర వినిమయ సేవలకు సంబంధించిన నెలవారీ బిల్లులను చెల్లించేందుకు ఆటో డెబిట్ సదుపాయాన్ని ఎంచుకున్నారా? అయితే రేపటి నుంచి మీ చెల్లింపులు ఆగిపోవచ్చు. ఆటో డెబిట్ పద్ధతిలో జరిపే చెల్లింపులకు సంబంధించి ఆర్బీఐ నిర్దేశించిన అడిషనల్ ఫ్యాక్టర్ అథెంటికేషన్ (ఏఎఫ్ఏ) నిబంధనలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుండటమే ఇందుకు కారణం. డెబిట్, క్రెడిట్ కార్డులతో జరిపే రికరింగ్ చెల్లింపులకు సంబంధించిన ఈ నిబంధనల ప్రకారం.. ఇకపై రూ.5 వేల కంటే ఎక్కువ మొత్తంలో జరిగే ఆటో డెబిట్‌కు ఓటీపీ నిర్ధారణ తప్పనిసరి. దీంతో ఆటో డెబిట్ షెడ్యూల్ తేదీకి 5 రోజుల ముందే సంబంధిత బ్యాంక్ నుంచి వినియోగదార్లకు అలర్ట్ వస్తుంది. అప్పుడు ఓటీపీతో వెరిఫై చేస్తేనే ఆటో డెబిట్ పూర్తవుతుంది. వాస్తవానికి ఏఎఫ్ఏ నిబంధనలను అమలు చేసేందుకు బ్యాంకులు సిద్ధం కాలేదు. మరోవైపు ఈ నిబంధనల అమలుకు నిర్దేశించిన గడువు (మార్చి 31)ను పొడింగించాలన్న ఐబీఏ విజ్ఞప్తిని రిజర్వు బ్యాంక్ ఇప్పటికే తిరస్కరించింది.ఫలితంగా ఆటో డెబిట్ పద్ధతిలో బిల్లులు చెల్లిస్తున్న కస్టమర్లకు ఏప్రిల్‌లో ఇబ్బందులు తప్పకపోవచ్చు. అయితే యూపీఐ లోని 'ఆటో పే' ఫీచర్‌ను ఉపయోగించి రికరింగ్ చెల్లింపులు జరిపే వారికి మాత్రం ఎలాంటి ఇబ్బందులు ఉండకపోవచ్చు.

# బాగా తగ్గిన బంగారం

ఉవ్వెత్తున ఎగిసిన బంగారం ధరలు దిగొస్తున్నాయి. మొన్నటిదాకా రికార్డు స్థాయిలో పలికిన పసిడి విలువ.. ఇప్పుడు పతనమవుతున్నది. మున్ముందు మరింతగా తగ్గే వీలుందన్న ఊహాగానాలూ జోరుగా ఉన్నాయి. ఈ క్రమంలోనే త్వరలో తులం రూ.42 వేలకు రావచ్చున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ పడిపోవడంతోపాటు దేశీయంగా పెండ్లిండ్ల సీజన్ కూడా కాకపోవడంతో కొనుగోళ్లు ఆశించిన స్థాయిలో సాగడం లేదు. దీంతో పుత్తడి ధరలు పతనం దిశగా పయనిస్తున్నాయి. దిగొచ్చే కస్టమ్స్ సుంకంతో ధరలు మరింత తగ్గవచ్చున్నఅభిప్రాయాలున్నాయి. ఇక మంగళవారం హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.380 తగ్గి రూ.45,110కి చేరుకున్నది. 22 క్యారెట్ల ధర రూ.41,350గా ఉన్నది.

బంగారం ధర తులం రూ.42వేలకు రావచ్చున్న అంచనాలు వినిపిస్తున్నాయి. మంగళవారం ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 10గ్రాముల బంగారం ధర రూ.140 తగ్గి రూ.44,110 వద్దకు చేరుకున్నది. సోమవారం ఈ ధర రూ.44,250గా ఉన్నది. పసిడితోపాటు వెండి ధరలూ దిగజారాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల



నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో కిలో వెండి ధర రూ.320 తగ్గి రూ.63,210కి దిగొచ్చింది.

**హైదరాబాద్‌లో రూ.380 తగ్గుదల**

హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.380 తగ్గి రూ.45,110కి చేరు కున్నది. 22 క్యారెట్ల ధర రూ.41,350గా ఉన్నది. అలాగే కిలో వెండి రూ.800 చౌకై రూ.68,500కు చేరింది. కరోనా కారణంగా స్టాక్ మార్కెట్ల నష్టాల మధ్య గతేడాది రికార్డు స్థాయిలో బంగారం ధరలు దూసుకుపోయిన విషయం తెలిసిందే. ఒక దశలో రూ.57వేలపైనే పలికింది. కానీ ప్రస్తుతం రూ.44 వేల స్థాయికి పడిపోయింది. రూ.13,000 దిగొచ్చింది. ఈ ఏడాది ఆరంభం నుంచే రూ.6వేలు తగ్గడం గమనార్హం.

**ఫ్యూచర్ మార్కెట్లోనూ అదే తీరు..**

ఫ్యూచర్ మార్కెట్లోనూ పసిడి ధరలు భారీగా పడిపోయాయి. ఏప్రిల్ నెలకుగాను తులం ధర 1.8 శాతం తగ్గి ఏడాది కనిష్ఠ స్థాయిలో రూ.43,800గా ఉన్నది. అలాగే వెండి ధర 1.2 శాతం దిగి రూ.64,060 వద్దకు చేరుకున్నది. మరోవైపు గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 1,698 డాలర్లకు, వెండి 24.49 డాలర్ల వద్ద నిలిచింది.

బంగారం, వెండి దిగుమతులపై తగ్గే కస్టమ్స్ సుంకంతో ధరలు మరింత దిగే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2021-22)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో ప్రకటించిన బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కస్టమ్స్ సుంకాన్ని 12.5 శాతం నుంచి 7.5 శాతానికి తగ్గించిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 1 నుంచి బడ్జెట్ నిర్ణయాలు అమల్లోకి వస్తుండటంతో బంగారం ధరలు ఇంకా దిగుతాయన్న అంచనాలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. 22 క్యారెట్ల తులం బంగారం ధర ఒకేసారి వెయ్యి దిగవచ్చున్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ఎల్ఐసీ షేరు ధర ఆకర్షణీయం

## వృద్ధికి అపార అవకాశాలు సంస్థ చైర్మన్ ఎంఆర్ కుమార్

న్యూఢిల్లీ: ఎల్ఐసీ ఐపీవో ధర ఎంతో ఆక్షణీయంగా ఉన్నట్టు ఆ సంస్థ చైర్మన్ ఎంఆర్ కుమార్ అన్నారు. కంపెనీ వృద్ధికి అపార అవకాశాలున్నాయని, ఇన్వెస్టర్లు రానున్న సంవత్సరాల్లో రాబడులను ఆశించొచ్చని అభిప్రాయపడ్డారు. ఎంబెడెడ్ వ్యాల్యూ కంటే.. నూతన వ్యాపార విలువ (వీఎన్‌బీ) రాబోయే కాలంలో ఎలా ఉంటుందో చూడాలని సూచించారు. భవిష్యత్తులో ఇది 12%--%13 శాతానికి చేరుకుంటుందని చెప్పారు. ప్రస్తుతం ఇది 9 శాతంగా ఉంది. ఐపీవోలో ఇన్వెస్టర్లు పాల్గొనడం ద్వారా లాభాలకు ఏమైనా అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు కుమార్ స్పందించారు. "ఇది మార్కెట్ అవగాహనపై ఆధారపడి ఉంటుంది. ఎల్ఐసీ తక్కువ వీఎన్‌బీతో ఆరంభమవుతోంది. కనుక వృద్ధికి అవకాశాలున్నాయి"అని చెప్పారు. కొత్త పాలసీలపై భవిష్యత్తులో ఆర్జించే రాబడులకు సంబంధించి ప్రస్తుత విలువే వీఎన్‌బీగా పేర్కొంటారు. ఎల్ఐసీ 1.11 రెట్ల ఎంబెడెడ్ వ్యాల్యూతో ఐపీవోకు వస్తోంది. గతంలో ప్రభుత్వరంగ బీమా సంస్థలైన న్యూ ఇండియా అష్యూరెన్స్, జీఐసీ ఆర్‌ఈ ఇన్వెస్టర్లకు రాబడులు ఇవ్వని అంశాన్ని ప్రస్తావించగా.. అవి భిన్నమైన వ్యాపారంలో ఉన్నాయని, అక్కడ లాభాల మార్జిన్లు చాలా తక్కువగా ఉంటాయని కుమార్ బదులిచ్చారు.

**మే 17న లిస్టింగ్**

ఎల్ఐసీ ఐపీవో ధరను ఒక్కో షేరుకు రూ.902%--%949గా నిర్ణయించడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం 3.5 శాతం వాటాను (22.13 కోట్ల షేర్లను) ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో విక్రయిస్తోంది. మే 4న ఐపీవో ప్రారంభమై 9న ముగియనుంది. మే 17న స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో లిస్ట్ కానుంది. ఐపీవో రూపంలో కేంద్రానికి రూ.21,000 కోట్లు సమకూరనున్నాయి. రూ.40 లక్షల కోట్ల నిర్వహణ ఆస్తులతో (ఏయూఎం) ఎల్ఐసీ దేశంలోనే అతిపెద్ద బీమా సంస్థగా కొనసాగుతోంది.

**25 యాంకర్ ఇన్వెస్టర్లు**

ఎల్ఐసీ ఐపీవోలో పాల్గొనేందుకు 25 మంది యాంకర్ ఇన్వెస్టర్లు ఆసక్తి చూపించారు. ఇందులో దేశ, విదేశీ ఇన్వెస్టర్లు ఉన్నట్టు లీడ్ మేనేజర్ వర్గాలు తెలిపాయి. మే 2న యాంకర్ బుక్ ప్రారంభం కానుంది. మొత్తం ఇష్యూలో క్యూఐపీలకు 50 శాతం కోటా కేటాయించగా.. ఇందులో 30 శాతాన్ని యాంకర్ ఇన్వెస్టర్లకు పక్కన పెట్టనున్నారు.

**ప్రభుత్వ హామీ కొనసాగుతుంది**

ఐపీవో తర్వాత కూడా ఎల్ఐసీ పాలసీలకు సంబంధించి ప్రభుత్వ హామీ సెక్షన్ 37 కింద కొనసాగుతుందని సంస్థ ఎండీ సిద్ధార్థ్ మొహంతి తెలిపారు. ఎల్ఐసీలో ప్రభుత్వ వాటా 51 శాతానికంటే దిగువకు పడిపోదని చెప్పారు.

**కనీస పబ్లిక్ వాటా నిబంధన సడలింపు**

కనీస ప్రజల వాటా నిబంధన నుంచి ఎల్ఐసీ ఐపీవోకు సడలింపు ఇవ్వాలని సెబీతో ఆర్థిక శాఖ చర్చలు నిర్వహిస్తోందని పెట్టుబడులు, ప్రజా ఆస్తుల నిర్వహణ విభాగం (దీపమ్) కార్యదర్శి తుహిన్ కాంత పాండే తెలిపారు. ఈ సమయంలో ఎల్ఐసీలో 5 శాతం వాటాలను కూడా మార్కెట్ సర్దుబాటు చేసుకునే పరిస్థితిలో లేదన్న విషయాన్ని గుర్తు చేశారు. లిస్ట్ అయిన ఏడాదిలోపు ఎల్ఐసీలో కేంద్ర ప్రభుత్వం తన వాటాలను తగ్గించుకోబోదని పాండే స్పష్టం చేశారు. సెబీ నిబంధనల ప్రకారం రూ.లక్ష కోట్లకుపైగా విలువైన కంపెనీలు ఐపీవోలో కనీసం 5 శాతానికి తక్కువ కాకుండా విక్రయించడానికి లేదు. అలాగే, లిస్ట్ అయిన ఐదేళ్లలోపు కంపెనీలో ప్రజల వాటా కనీసం 25 శాతానికి తక్కువ ఉండకూడదు.

**ఐపీవోలో రూ.5లక్షలకు పేటీఎం అనుమతి**

పేటీఎం మనీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ఇన్వెస్టర్లు ఎల్ఐసీ ఐపీవోలో యూపీ ఐ ద్వారా రూ.5లక్షల వరకు పెట్టుబడి పెట్టుకునే అవకాశం కల్పిస్తున్నట్టు ప్రకటించింది. ఈ విషయాన్ని పేటీఎం మనీ సీఈవో వరుణ్ శ్రీధర్ తెలిపారు. ఇన్వెస్టర్లు పేటీఎం మనీ యాప్ హోమ్ పేజీలో ఐపీవో సెక్షన్‌కు వెళ్లాలి. అక్కడ ఇన్వెస్టర్ కేటగిరీని ఎంచుకుని బిడ్‌ను దాఖలు చేసుకోవచ్చు. రూ.5లక్షల వరకు బిడ్ వేయాలనుకుంటే హెచ్ఎన్ఐ కేటగిరీని ఎంపిక చేసుకోవాలి.




## ఆ ఐటీ నిపుణులకు కాగ్నిజెంట్ తీపి కబురు

న్యూఢిల్లీ: కొంత విరామం తర్వాత మళ్లీ కెరియర్ ప్రారంభించాలనుకుంటున్న టెక్నాలజీ నిపుణుల కోసం ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్ 'రిటర్న్‌షిప్ ప్రోగ్రాం' ప్రారంభించింది. ఇది 12 వారాల పాటు ఉంటుంది. మారిన పరిస్థితులకు అనుగుణంగా ప్రతిభావంతులైన నిపుణులకు అవసరమైన శిక్షణ కల్పించడం, సలహాలివ్వడం, ఇతరత్రా అవసరమైన వనరులను సమకూర్చేందుకు ఈ ప్రోగ్రాం దోహదపడుతుందని కాగ్నిజెంట్ ఇండియా సీఎండీ రాజేష్ నంబియార్ తెలిపారు. మళ్లీ ఉద్యోగాల్లో చేరాలనుకునే ప్రొఫెషనల్స్‌లో చాలామంది మహిళలు కూడా ఉంటున్నారని, తొలి బ్యాచ్‌లో ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్ విధులపై ఆసక్తి ఉన్న వారికి చోటు కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.



## హొండా నుంచి మరో ప్రీమియం బైక్

ముంబై,: ప్రము ఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హొండా మోటర్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండి యా (హెచ్ఎంఎస్ఐ) తన ప్రీమియం బైక్‌ల శ్రేణిని మరింత విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నది. దీనిలో భాగంగా సరికొత్త సీబీ-650ఆర్ బైక్‌తోపాటు అప్‌డేటెడ్ సీబీఆర్-650ఆర్ బైక్‌ను మంగళవారం దేశీయ మార్కెట్లో ప్రవేశపెట్టింది. వీటిలో సీబీ-650ఆర్ బైక్ ఎక్స్-షోరూమ్ (గుర్గావ్) ధరను రూ.8.88 లక్షలుగా, సీబీఆర్-650ఆర్ బైక్ ధరను రూ.8.67 లక్షలుగా నిర్ణయించినట్లు హెచ్ఎంఎస్ఐ వెల్లడించింది.

# ధోనీసేన తలరాత రోహిత్ చేతిలో



ఐపీఎల్ 2022 సీజన్.. ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్‌కు చేదు జ్ఞాపకాలను మిగిల్చేదే. ఐపీఎల్ చరిత్రలో మోస్ట్ సక్సెస్‌ఫుల్ జట్లుగా పేరున్న ఈ రెండూ ఈ సీజన్‌లో ఘోరంగా విఫలం అయ్యాయి. భారత క్రికెట్ జట్టు మాజీ కేప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ, ప్రస్తుత కేప్టెన్ రోహిత్ శర్మ నాయకత్వాన్ని వహిస్తోన్న జట్లవి. ఈ రెండు టీమ్స్ కలిసి తొమ్మిదిసార్లు ఐపీఎల్ ఛాంపియన్స్ టైటిల్‌ను ఎగరేసుకెళ్లాయి. ఇందులో ముంబై ఇండియన్స్ వాటా.. అయిదు. ఇప్పటివరకు ఏ జట్టు కూడా ఇన్నేసి సార్లు టైటిల్ గెలవలేదు.

### వాంఖెడెలో బ్లాక్ బస్టర్ మ్యాచ్..

ఈ సీజన్‌లో రెండు జట్లు కూడా కూడబలుక్కున్నట్లు అధ్వాన్నంగా ఆడుతున్నాయి. ఇప్పుడీ రెండు జట్లు తలపడనున్నాయి. ముంబైలోని వాంఖెడె స్టేడియం ఈ బ్లాక్ బస్టర్ మ్యాచ్‌కు వేదిక. సాయంత్రం 7:30 గంటలకు గేమ్ ఆరంభమౌతుంది. ముంబై ఇండియన్స్‌తో పోల్చుకుంటే చెన్నై సూపర్ కింగ్స్ పరిస్థితి కొంతలో కొంత బెటర్. 11 మ్యాచ్‌ల్లలో నాలుగింట్లో విజయాలను అందుకుంది. అదే 11 మ్యాచ్‌లను ఆడిన ముంబై ఇండియన్స్ గెలిచింది రెండే.

### చెన్నైపై ఆశలు మిణుకు

ఈ రెండు టీమ్స్ ప్లేఆఫ్స్‌కు చేరుతాయనే ఆశల్లేవు. తన చివరి మ్యాచ్‌లో ఢిల్లీ కేపిటల్స్‌పై ఏకంగా 91 పరుగుల తేడాతో విజయం సాధించిన అనంతరం చెన్నై సూపర్ కింగ్స్ ప్లేఆఫ్స్ ఆశలు కొంత మెరుగుపడ్డాయి. ముంబై ఇండియన్స్‌తో పాటు మిగిలిన మ్యాచ్‌లల్లో గుజరాత్ టైటాన్స్, రాజస్థాన్ రాయల్స్‌పై అదే రేంజ్ రన్‌రేట్‌తో విజయం సాధించగలిగితే అద్భుతం జరిగే అవకాశాలు లేకపోలేదు. ఈ మూడింట్లో నెగ్గడంతో మొత్తం 10 పాయింట్లు ప్లస్ మెరుగైన రన్‌రేట్‌తో సీఎస్‌కే ప్లేఆఫ్స్‌లో చేరొచ్చనే అంచనాలు ఉన్నాయి.

### ఓపెనర్లు గాడిన పడటం..

ఇవ్వాళ్టి మ్యాచ్ కోసం చెన్నై సూపర్ కింగ్స్ ఎలాంటి ప్రయోగాలు చేయట్లేదు. ఢిల్లీ కేపిటల్స్‌ను ఓడించిన జట్టుతోనే ముంబై ఇండియన్స్ సంగతేంటో తేల్చనుంది. ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ ఫామ్‌ను అందిపుచ్చుకోవడం ధోనీసేనకు బిగ్ రిలీఫ్. డీసీపై మ్యాచ్‌లో 41, అంతకుముందు సన్‌రైజర్స్‌పై 99 పరుగులు చేశాడు. మరో ఓపెనర్ డెవాన్ కాన్వే.. నిలకడగా ఆడుతున్నాడు. చివరి మూడు మ్యాచ్‌ల్లలో 85,56,87 పరుగులు ఊది పడేశాడు. ఈ మూడు మ్యాచ్‌లల్లో ఓపెనింగ్ భాగస్వామ్యం అదిరింది. 110,54,182 పార్ట్‌నర్‌షిప్ అందించారు.

### మిడిలార్డర్..బలహీనం

మిడిలార్డర్‌లో రాబిన్ ఉతప్ప, అంబటి రాయుడు, శివందుబే నిలకడను కోల్పోయారు. మొదట్లో అదరగొట్టిన రాబిన్ ఉతప్ప.. రానురాను నీరసించాడు. చివరి రెండు మ్యాచ్‌ల్లలో అతను చేసింది 1,0 పరుగులు. అంబటి రాయుడిదీ అదే పరిస్థితి. ఆరంభంలో సత్తాచాటినప్పటికీ.. ఆ తరువాత నిలకడను కోల్పోయాడు. వీరిద్దరితో పాటు శివందుబే కూడా క్రీజ్‌లో నిలదొక్కుకోవాలని భావిస్తోంది చెన్నై సూపర్ కింగ్స్. ఆల్‌రౌండర్ మొయిన్ అలీ ఆటతీరు గాడినపడటం ఆ జట్టుకు ఊరటనిస్తోంది.

### బౌలింగ్ ఫుల్ స్వింగ్..

చెన్నై సూపర్ కింగ్స్ బౌలింగ్ విభాగం బలంగా ఉంది. ఢిల్లీ కేపిటల్స్‌ను 117 పరుగులకే కట్టడం ఆ జట్టు బౌలింగ్ డిపార్ట్‌మెంట్ పదునుకు అద్దం పట్టింది. మహీష్ తీక్షణ, డ్వేన్ బ్రావో, డ్వైన్ ప్రిటోరియస్, ముఖేష్ చౌదరి.. నిప్పుల్లాంటి బంతులను సంధిస్తున్నారు. ఆల్‌రౌండర్ మొయిన్ అలీ స్పిన్ బౌలింగ్‌తో మేజిక్ చేస్తోన్నాడు. టోర్నమెంట్ సాగుతున్న కొద్దీ బౌలర్లు రాటుదేలారు. అదే ఫామ్ ఈ మ్యాచ్‌లోనూ కంటిన్యూ చేస్తే.. మరో విజయం చెన్నై ఖాతాలో పడుతుంది. దీనికి పూర్తి భిన్నంగా ఉంది ముంబై ఇండియన్స్ పరిస్థితి. ఇప్పటివరకు ఆడిన 11 మ్యాచ్‌లల్లో రెండింటినే గెలిచింది. చివరి మ్యాచ్‌లో కోల్‌కత నైట్‌రైడర్స్ చేతిలో మరీ అధ్వాన్నంగా ఓడింది. కేకేఆర్ నిర్దేశించిన 165 పరుగులను కూడా ఛేదించలేకపోయింది. 113కే కుప్పకూలింది. ఒక్క ఇషాన్ కిషన్ మినహా మరెవరూ భారీ స్కోర్ చేయలేకపోయారు. బౌలింగ్ విభాగం కూడా ఆశించిన స్థాయిలో ఉండట్లేదు.

### రోహిత్ శర్మ నుంచి

ఓపెనర్ కమ్ కేప్టెన్ రోహిత్ శర్మ బ్యాట్ నుంచి ఇప్పటివరకు భారీ స్కోర్ జాలువారలేదు. తన మార్క్ బ్యాటింగ్, తన మార్క్ భారీ షాట్లను ఆడటాన్ని మర్చిపోయాడా అనిపించేలా తయారయ్యాడు రోహిత్ శర్మ. ఇషాన్ కిషన్‌లో నిలకడ ఉండట్లేదు. సూర్యకుమార్ యాదవ్ గాయం వల్ల జట్టుకు దూరం కావడం దెబ్బకొట్టింది. తిలక్ వర్మ ఫర్వాలేదనిపించుకుంటున్నప్పటికీ.. మ్యాచ్ విన్నింగ్ నాక్ ఆడలేదు. కీరన్ పొల్లార్డ్‌దీ అదే పరిస్థితి. కాగా ఈ మ్యాచ్‌లో ఒక్క మార్పు చేసే అవకాశం ఉంది ముంబై ఇండియన్స్. రమణ్‌దీప్ లేదా ట్రిస్టన్ స్టబ్స్‌ను తుదిజట్టులోకి తీసుకునే అవకాశం ఉంది.



## రూ.20 లక్షలు డిపాజిట్ చేస్తే పాన్/ఆధార్

**ఖాతా నుంచి ఉపసంహరించుకున్నా సరే**

**కరెంటు ఖాతా తెరవడానికి కూడా ఇవ్వాల్సిందే**

న్యూఢిల్లీ: కరెంటు ఖాతా తెరవడానికి, పెద్ద మొత్తంలో నగదు డిపాజిట్లు, ఉపసంహరణలకు పాన్/ఆధార్ నంబర్ ఇవ్వడాన్ని తప్పనిసరి చేస్తూ ఆదాయపన్ను శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.20లక్షలకు మించి డిపాజిట్ చేసినా, ఉపసంహరించుకున్నా బ్యాంకుకు పాన్ లేదా ఆధార్ ఏదో ఒకటి సమర్పించాలి. అలాగే, బ్యాంకు, పోస్టాఫీసులో కరెంటు ఖాతా లేదా క్యాష్ క్రెడిట్ ఖాతా తెరవాలన్నా వీటిని తప్పనిసరి చేస్తూ ఆదాయపన్ను శాఖకు చెందిన ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) నోటిఫికేషన్ జారీ చేసింది. దీనివల్ల లావాదేవీల్లో మరింత పారదర్శకత వస్తుందని ఏకేఎం గ్లోబల్ ట్యాక్స్ పార్ట్‌నర్ సందీప్ సెహగల్ అన్నారు. బ్యాంకులు, పోస్టాఫీసులు, కోఆపరేటివ్ సొసైటీలు రూ.20 లక్షలు అంతకుమించి నగదు లావాదేవీలను ఆదాయపన్ను శాఖకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. "డిపాజిట్లు, ఉపసంహరణకు పాన్‌ను తీసుకోవడం అంటే వ్యవస్థలో నగదును గుర్తించే విషయంలో ప్రభుత్వానికి సాయంగా ఉంటుంది. మొత్తం మీద ఇది అనుమానిత నగదు డిపాజిట్లు, ఉపసంహరణలను కఠినతరం చేస్తుంది"అని సెహగల్ వివరించారు.

## కుప్పలు.. తిప్పలు

హైదరాబాద్: రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యానికి నిదర్శనమిది. రాష్ట్రవ్యాప్తంగా వరికోతలు సాగుతూ ధాన్యం కేంద్రాలకు పోటెత్తుతున్నా ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు జరగడం లేదు. పలుచోట్ల గన్నీ బ్యా గుల కొరత, ఇతర సౌకర్యాలు సరిగా లేకపోవడం, ఇటీవలి అకాల వర్షాలతో ధాన్యం తడిసి తేమ శాతం పెరగడం, రంగు మారడం, అధికారుల అలసత్వం, మిల్లర్ల కొర్రీలు కలిసి కొనుగోళ్ల ప్రక్రియ నత్తనడకన సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనితో రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు వద్ద కుప్పలతో నిండిపోతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ఓవైపు గన్నీ సంచులకు, ధాన్యాన్ని మిల్లులకు తరలించే లారీలకు కొరత.. మరోవైపు సన్నరకాలే తీసుకుంటామంటూ, తరుగు తీస్తూ మిల్లర్లు పెడుతున్న కొర్రీలు సమస్యగా మారాయి. ధాన్యం కొనుగోళ్లలో జాప్యానికి ఇదే కారణమని కేంద్రాల నిర్వాహకులు చెప్తున్నారు. ఇటీవలి అకాల వర్షానికి యాదాద్రి, పెద్దపల్లి, నల్లగొండ, జనగామ, కరీంనగర్, వరంగల్, మెదక్, సంగారెడ్డి మొదలైన జిల్లాల్లో పెద్ద ఎత్తున ధాన్యం తడిసిపోయింది. ఆ ధాన్యాన్ని ఆరబెట్టినా కొనుగోలు చేసేందుకు సెంటర్లలో కొర్రీలు పెడుతున్నట్టు విమర్శలున్నాయి. వేస వి ఎండలు మండిపోతున్న పరిస్థితుల్లో తేమ శాతం ఎక్కువనే సమస్య లేకపోయినా.. ధా న్యం రంగుమారి నల్లబడిందని, ఇసుక చేరింద నే సాకులు చెప్తున్నట్టు రైతులు వాపోతున్నారు.

# ఢిల్లీ ఆశలు పదిలం

ముంబై: సీజన్‌లో ఒక విజయం తర్వాత ఒక పరాజయం... గత పది మ్యాచ్‌లలో ఇలాగే పడుతూ, లేస్తూ సాగుతున్న ఢిల్లీ క్యాపిటల్స్ అదే శైలిని కొనసాగించింది! తాజా ఫలితం అనంతరం సరిగ్గా సగం మ్యాచ్‌లలో విజయం, సగం పరాజయాలతో ఆ జట్టు ఇంకా ప్లే ఆఫ్స్ ఆశలు పదిలంగా ఉంచుకుంది. బుధవారం జరిగిన పోరులో క్యాపిటల్స్ 8 వికెట్లతో రాజస్తాన్ రాయల్స్‌పై నెగ్గింది. ముందుగా రాజస్తాన్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 160 పరుగులు చేసింది. అశ్విన్ (38 బంతుల్లో 50బీ 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ చేయగా, దేవదత్ పడిక్కల్ (30 బంతుల్లో 48బీ 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం ఢిల్లీ 18.1 ఓవర్లలో 2 వికెట్లకు 161 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మిచెల్ మార్ష్ (62 బంతుల్లో 89బీ 5 ఫోర్లు, 7 సిక్స్‌లు), డేవిడ్ వార్నర్ (41 బంతుల్లో 52 నాటౌట్‌బీ 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు. వీరిద్దరు రెండో వికెట్‌కు 144 పరుగులు జోడించి జట్టును గెలిపించారు. ప్రమాదకర బ్యాటర్ బట్లర్ (7)ను అవుట్ చేసి సకరియా ఢిల్లీకి శుభారంభం అందించగా, యశస్వి జైస్వాల్ (19) కూడా ఎక్కువసేపు నిలవలేదు. అయితే అనూహ్యంగా మూడో స్థానంలో వచ్చిన అశ్విన్ కొన్ని చక్కటి షాట్లతో ఆకట్టుకున్నాడు. శార్దూల్ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన అతను, అక్షర్ ఓవర్లో వరుస బంతుల్లో 4, 6 బాదాడు. మరో ఎండ్‌లో పడిక్కల్ కూడా ధాటిని ప్రదర్శించాడు. అక్షర్ ఓవర్లో వరుస బంతుల్లో అతను రెండు సిక్సర్లు కొట్టాడు. 37 బంతుల్లో అశ్విన్ అర్ధ సెంచరీ పూర్తయింది. ఐపీఎల్ సహా టి20 క్రికెట్‌లో అతనికి ఇదే తొలి హాఫ్ సెంచరీ కావడం విశేషం. మూడో వికెట్‌కు పడిక్కల్‌తో 36 బంతుల్లో 53 పరుగులు జోడించిన అనంతరం అశ్విన్ వెనుదిరగ్గా... సామ్సన్ (6), పరాగ్ (9) విఫలమయ్యారు.

కేఎస్ భరత్ (0) మరోసారి విఫలమవ్వగా... వార్నర్, మార్ష్ కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించారు. పవర్‌ప్లే ముగిసేసరికి ఢిల్లీ స్కోరు 38 పరుగులకు చేరింది. మార్ష్ దూకుడు కనబర్చగా, వార్నర్ నెమ్మదిగా ఆడాడు. కుల్దీప్ సేన్ ఓవర్లో రెండు సిక్సర్లు బాదిన మా చహల్ ఓవర్లో మరో భారీ సిక్స్‌తో 38 బంతుల్లో అర్ధ సెంచరీ చేశాడు. 79 బంతుల్లో 100 పరుగుల భాగస్వామ్యం నమో దైంది. వేగంగా ఆడుతూ సెంచరీ దిశగా దూసుకుపోయిన మార్ష్ ఆ అవకాశం చేజార్చుకున్నాడు. 18 బంతుల్లో 17 పరుగులు చేయాల్సిన స్థితిలో మా అవుటయ్యాడు. వార్నర్, పంత్ (13 నాటౌ ట్‌బీ 2 సిక్స్‌లు) కలిసి మిగతా పనిని పూర్తి చేశారు.



# ఈ దశాబ్దం భారత్‌దే

**వృద్ధి ఫలాలు అందరికీ అందాలి**

**కోట్లాది మందిని పేదరికం నుంచి బయటకు తేవాలి**

**టాటా గ్రూపు చైర్మన్ చంద్రశేఖరన్**



న్యూఢిల్లీ: ప్రస్తుత దశాబ్దం (2030 వరకు) భారత్‌కు ఆశావహం అని, ఎన్నో అవకాశాలు రానున్నాయని టాటా గ్రూపు చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ అన్నారు. దేశ సమగ్ర అభివృద్ధికి కోట్లాది మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అలాగే, మరింత మంది మహిళలను ఉద్యోగాల్లోకి వచ్చేలా చూడాలన్నారు. సీఐఐ నిర్వహించిన వ్యాపార సదస్సులో ఆయన మాట్లాడారు. రానున్న దశాబ్దాల్లో 70% ప్రపంచ వృద్ధి అంతా వర్ధమాన దేశాల నుంచే ఉంటుందని చంద్రశేఖరన్ అంచనా వేశారు. అందులోనూ ఇతర వర్ధమాన దేశాలతో పోలిస్తే భారత్ వృద్ధి రేటు ఎక్కువగా ఉంటుందని, భారత్ ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు.

సమ్మిళిత వృద్ధి..: "మనం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనున్నాం. కానీ, ఈ వృద్ధి ఫలాలు అందరూ అనుభవించే విధంగా ఉండాలి. ధనిక, పేదల మధ్య అంతరం పెరగకుండా చూడాలి. నా వరకు ఇదే మూల సూత్రం"అని చంద్రశేఖరన్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కనీస నాణ్యమైన జీవనాన్ని ప్రతి ఒక్కరూ పొందేలా ఉండాలన్నారు. రానున్న పదేళ్లలో కోట్లాది మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురావాలని సూచించారు. "స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి చూస్తే భారత్ ప్రపంచ జీడీపీలో 3% నుంచి 7%కి చేరింది. ఈ అభివృద్ధి వల్ల గత పదేళ్లలోనే 27 కోట్ల మంది పేదరికం నుంచి విముక్తులయ్యారు. మనం కొత్త వ్యాపారాలు, కొత్త రంగాల్లోకి అడుగు పెట్టాం. నేడు ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌గా అవతరించాం. 2022లోనే ఇప్పటి వరకు చూస్తే ప్రతీ వారం ఒక యూనికార్న్ ఏర్పడింది. అయినా, మనం ఇంకా ఎంతో దూరం ప్రయాణించాల్సి ఉంది. అది మహిళలకు ఉపాధి కల్పించే విషయంలోనూ. ఇప్పటికీ ఎంతో మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. వీరు ఆరోగ్య, విద్యా సదుపాయాలను అందుకోలేకున్నారు"అని చంద్రశేఖరన్ తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ మరింత ఉన్నత శిఖరాలకు చేరుకుంటుందని చంద్రశేఖరన్ పేర్కొన్నారు. "5 లక్షల కోట్ల డాలర్లు, 8 లక్షల కోట్ల డాల ర్లకు భవిష్యత్తులో చేరుకుంటాం. తలసరి ఆదాయం రెట్టింపు అవుతుంది. కానీ, ఇది సమ్మిళితంగా ఉండాలి" అని తెలిపారు. ఈ దశాబ్దం భారత ్దేనని మరోసారి గుర్తు చేస్తూ ఈ క్రమంలో సమస్యలు, సవాళ్లను పరిష్క రించుకున్నప్పుడే అవకాశాలను అందిపుచ్చుకోగలమన్నారు. సమాజంలోని అంతరాలను తొలగించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. పని ప్రదేశాల్లో మహిళల ప్రాతినిధ్యం తగ్గిపోతున్న విషయాన్ని ఎన్.చంద్రశేఖరన్ గుర్తు చేశారు. గత దశాబ్దంలో ఇది 27 శాతం నుంచి 23 శాతానికి దిగివచ్చినట్టు చెప్పారు. అయితే, కొత్త నైపుణ్య నమూనా కారణంగా ఇది మారుతుందన్నారు. ఇంటి నుంచే పని విధానం ఇప్పుడప్పుడే పోదంటూ, అది శాశ్వతంగానూ కొనసాగదన్నారు.

# ఈయూతో ఎఫ్‌టీఏ దిశగా అడుగులు

ముంబై: యూరోపియన్ యూనియన్‌తో (ఈయూ) వచ్చే ఏడాది నాటికి భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (ఎఫ్‌టీఏ) కుదుర్చుకుంటుందని వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఐఎంసీ చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన ఒక కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

దేశం ఇప్పటికే యునైటెడ్ అరబ్ ఎమిరైట్స్ (యూఏఈ), ఆస్ట్రేలియాతో ఒప్పందాలు కుదుర్చుకుంది. యూరోపియన్ యూనియన్, బ్రిటన్, కెనడా, గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ)సహా ఇతర దేశాలు లేదా బ్లాక్‌లతో ఎఫ్‌టీఏపై చర్చలు జరుపుతోంది. ఇటలీకి చెందిన విదేశాంగ మంత్రితో సహా ఒక ప్రతినిధి బృందం దేశ రాజధానితో పర్యటిస్తోంది. ఎఫ్‌టీఏపై ఈ సందర్భంగా చర్చలు జరగనున్నాయి. ఇప్పటికే బ్రిటన్‌తో మూడు దఫాల చర్చలు జరిగాయి. త్వరలో నాలుగో రౌండ్ చర్చలు జరిగే అవకాశం ఉంది. మే 26-27 తేదీల్లో బ్రిటన్ ప్రతినిధులతో కీలక సమావేశం జరగనుంది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు భారతదేశంలో వృద్ధిని పెంచుతాయి. భారీ ఉపాధి కల్పనకు వీలు కలుగుతుంది. భారత్ ఇతర దేశాలు లేదా కూటములతో న్యాయమైన, పరస్పర ప్రయోజనకరమైన, విజయవంతమైన భాగస్వామ్యాల కోసం ఎదురు చూస్తోంది.2021-22 ఆర్థిక సంవత్సరంలో భారత్ 400 బిలియన్ డాలర్లకుపైగా ఎగుమతులు జరిపి రికార్డు సృష్టించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్‌లో దేశం ఎన్నడూ లేని విధంగా 38 బిలియన్ డాలర్ల ఎగుమతులను నమోదు చేసింది. ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు రికార్డు స్థాయి ఎగుమతులు నమోదవుతాయన్న విశ్వాసం ఉంది. అత్యంత నాణ్యతా ప్రమాణాలు కలిగిన ఉత్పత్తుల తయారీ కేంద్రంగా భారత్ అభివృద్ధి చెందుతోందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రొడక్ట్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్, మౌలిక రంగం పురోగతికి చర్యల తత్సబంధ కార్యక్రమాల ద్వారా దేశం ఆశించిన ఫలితాలను సాధిస్తోంది. ఏప్రిల్‌లో చరిత్రాత్మక రికార్డు స్థాయిలో రూ. 1.67 లక్షల కోట్లకు పైగా వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్ల జరిగాయి. విశ్లేషకుల అంచనాలను మించి ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవడం ఆశాజనకం. పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్‌లు కూడా ఆర్థిక వ్యవస్థ వేగవంతమైన రికవరీ, పునరుద్ధరణను సూచిస్తున్నాయి. 2021లో దేశం 82 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఏ) ఆకర్షించింది. ఇది ఎన్నడూ లేనంత అత్యధికం. చట్టబద్ధమైన పాలన, ప్రపంచంలోనే అతిపెద్ద



ప్రజాస్వామ్య వ్యవస్థ, పారదర్శక న్యాయ వ్యవస్త, వ్యాపారాలను ఆకర్షించే స్థిరమైన విధానాల వంటి అంశాలు ఈ రికార్డుల సాధనకు కారణం.

### ఆస్ట్రేలియా దిగుమతుల్లో

### కొన్నింటికే సుంకాల మినహాయింపు

ఆస్ట్రేలియా నుంచి దిగుమతి చేసుకునే వాటిల్లో 29.8 శాతం ఉత్పత్తులకు సుంకాలపరమైన మినహాయింపులు వర్తించవని కేంద్రం వెల్లడించింది. డైరీ ఉత్పత్తులు, ఆహార ధాన్యాలు, విలువైన లోహాలు, ఆభరణాలు మొదలైనవి ఈ జాబితాలో ఉన్నాయి. దేశీ పరిశ్రమ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మినహాయింపులు వర్తించే ఉత్పత్తుల జాబితా నుంచి వీటిని తొలగించినట్లు కేంద్రం తెలిపింది. భారత్–ఆస్ట్రేలియా మధ్య కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి (ఇండ్‌ఆస్ ఈసీటీఏ) సంబంధించిన సందేహాల నివృత్తి కోసం వాణిజ్య శాఖ ఈ మేరకు వివరణ (ఎఫ్ఏక్యూ) జారీ చేసింది. ఏప్రిల్ 2న కుదిరిన ఈ ఒప్పందం ఇంకా అమల్లోకి రావాల్సి ఉంది. ఎఫ్ఏక్యూ ప్రకారం రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం ప్రస్తుత 27.5 బిలియన్ డాలర్ల నుంచి 45-50 బిలియన్ డాలర్లకు చేరనుంది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-50565, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035 T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-50565, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035, Editor : B. Sridhar Yadav + 918121529009, RNI.No. APTEL/2013/51038